సీరియల్

• బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

ఆమె మాటలు యింకా పూర్తికానే లేదు.

ఒక్కసారిగా యెక్కడ్నుంచో సింహగర్జన వినిపించింది. మొదట్లో అది సింహగర్జన కాదేమోననుకున్నారు. కాని వారి అనుమానాలను నివృత్తి చేస్తూ మృగరాజు కళ్ళ ముందు మెరుపు వేగంతో ఎగరటం కనిపించింది.

దుప్పిని వేటాడిన సంబరంలో వున్న ఆటవికులమీదికి ఏ మూలనుంచో అమాంతం దూకింది సింహం. దూకుతూనే ఒకడ్ని నేలకరిపించి, మరొకడి కంఠం కసుక్కున కొరికి రక్తం పీల్చేసింది. మూడోవాడ్ని పంజాతో ముఖంమీద కొట్టింది. పెద్ద మాంసఖండాన్ని నోట కరచుకుంది.

సౌమ్య కెవ్వున కేకవేయబోయింది. ఆమె కేక గొంతులోనే ఆగిపోయింది. మిగిలిన యిద్దరు ఆటవికులు కకావికలై తలోదిక్కు ప్రాణభీతితో పరుగులు పెట్టారు.

సింహం ముగ్గుర్నీ చంపేసింది. తనకొక్కవలసినంత మాంసం తిని కళేబరాల్ని అలాగే వదిలేసి వచ్చినంత వేగంగానూ ఎటో మాయమైపోయింది!

పెద్దపులి ఒకసారి వేటాడిన జంతువును దాచుకుని కళ్ళుపెట్టుకొని తింటుంది. సింహం అలా కాదు. ఎప్పుడు కావలిస్తే అప్పుడు! అప్పటికప్పుడు వేటాడి ఆహారాన్ని సంపాదించుకుంటుంది. మిగిలిన ఆహారం అలా వదిలేసి పోతుంది.

జీవితంలో మొదటిసారిగా సింహం వేటాడటం స్వయంగా చూశారు నవీన్, సౌమ్య. సింహానికి మృగరాజనే పేరెలా వచ్చిందో గ్రహించారు వాళ్ళు.

"ఈ అడవిలో లేని జంతువు లేదంటే అతిశయోక్తి కాదేమో! క్రూరమృగాలకి ఆటపట్టులాగా వున్నది. నేల మీదకి దిగేకన్నా యీ చెట్టు మీదే సురక్షితంగా వున్నట్టుంది...."

నవీన్ మాటలు పూర్తికానేలేదు. సౌమ్య అతన్ని భుజంపట్టి పక్కకులాగింది. ఆ ఊపుకు నేలమీదకు పడిపోయేవాడే!

సౌమ్య చూపుల్లో భయం కొట్టొచ్చినట్టు కనిపించింది. నవీన్ ఆమె చూపులు ప్రసరించిన వైపుని చూసి త్రుళ్ళిపడ్డాడు.

పైకొమ్మమీది నుంచి సరాసరి తన మొహందాకా వచ్చిన కొండచిలువ కొండ గుహలాంటి నోరు తెరుచుకుని తనని కబళించటానికి సిద్ధంగా వుంది. సరిగ్గా అదే సమయంలో తనని పక్కకి లాగింది సౌమ్య.

చుట్లూ చుట్లుగా పైకొమ్మకు చుట్టుకొని వున్నది కొండచిలువ. ఒకేసారి మనిషిని మింగేసి జీర్ణంచేసుకోగల

మహాకాయంగల చిలుక అది!

మెరుపు వేగంతో సౌమ్యను తీసుకొని కింది కొమ్మకి దాని పైనుంచి నేలమీదకి దిగిపోయాడు నవీన్. అంతా క్షణాల్లో జరిగిపోయింది!

నవీన్ సింహం వేటాడిన స్థలం వైపు అడుగులు వేస్తుంటే "అటు ఎక్కడికి? అక్కడ సింహం ..." అని సౌమ్య యేదో అనబోతుండగా ఆమె చేతిని మెల్లగా నొక్కి, చిన్నగా నవ్వి "సింహం ఈరోజు మరి వేటాడదు. దానికి అత్యాశ లేదు. మళ్ళీ ఆకలయ్యే వరకు ఆహారం జోలికి పోదు. దానికి యిప్పట్లో ఎటూ ఆకలి వెయ్యదు" అన్నాడు.

* * *

ఆ దృశ్యం చాలా బీభత్సంగా వుంది.

శరీర భాగాలన్నీ శస్త్ర చికిత్స చేసినట్టు ముక్క ముక్కలయిపోయిన ఆటవికుల కళేబరాలు రక్తంతో తడిసి భయోత్పాతం కలిగిస్తున్నాయి. జుగుప్సతో కళ్ళు మూసుకుంది సౌమ్య.

నవీన్ కిందపడివున్న ఆటవికుల విల్లులు రెండు తీసుకున్నాడు. మూడోది విరిగిపోయింది. అంబుల పొదులు కూడా చెదిరిపడిపోయాయి. వాటినికూడా సేకరించాడు.

"నీకు విల్లుపయోగించటం వచ్చా?" అన్నాడు నవీన్. రాదని తల అడ్డంగా తిప్పింది.

"నాకు వచ్చు. ఏరో షూటింగ్ చాలా ఇంట్రెస్టింగ్ ఆర్ట్. నేను హైద్రాబాద్ లో నేర్చుకున్నాను" అన్నాడు నవీన్. సౌమ్య అతని వంకే చూస్తోంది.

"సరే అంబులపొది, ఓ విల్లు నీ దగ్గరుంచు ప్రస్తుతం ప్రాణరక్షణకు మనకివే ఆయుధాలు!" అన్నాడు చిన్నగా

నవ్వి.

వాళ్ళిద్దరు ఆ స్పాట్ నించి పదిగజాలు ముందుకు వెళ్ళారో లేదో, శవాలని పీక్కుతినటానికి ఎక్కడెక్కణ్నుంచో నక్కలు రాబందులు హాజరై పోయాయి.

“తొందరగా నడు. రాబందులు బతికున్నవాళ్ళ కళ్ళు కూడా పొడిచేస్తాయని విన్నాను” అన్నాడు నవీన్ సౌమ్య చేతిని పట్టుకొని ముందుకు నడుస్తూ.

ఓ ఫర్లాంగు దూరం గమ్యంలేకుండా అలాగే సాగి పోయారు.

ముందుకు అడుగు వెయ్యబోయి చటుక్కున ఆగి పోయాడు నవీన్. సౌమ్య ప్రశ్నార్థకంగా చూసిందతని వంక.

ఎదురుగా ఆకులు అలములతో కప్పి వుంచిన పెద్ద గొయ్యిని చూపించాడు నవీన్. సౌమ్య ఆశ్చర్యంగా చూసింది.

జంతువులకోసం పెట్టిన మాటు అది! బహుశా యిందాకటి అయిదుగురు ఆటవికులు జంతువుల్ని వేటాడటానికి మాటు పన్నారన్నమాట! నాగరికులే కాదు, ఈ ఆటవికులుకూడా వేటలో అధునాతన పద్ధతులు నేర్చారా? లేక యీ ఆటవికుల్నించే నాగరికులు నేర్చుకున్నారా? ఏమో ....!

నేలమీద ప్రతి అంగుళం జాగ్రత్తగా చూసుకుంటూ నడుస్తున్నారు — అదే సన్నని కాలిబాట వెంట. రాను రాను దారి మరీ యిరుకై పోయింది. ఈ దారి అసలు యెక్కడికిపోతోంది? అంతా అగమ్యగోచరంగా

వున్నది!

కొద్దిదూరం నడిచారో లేదో ఎక్కడ్నుంచో 'ఢాఢా'మంటూ అడవి కుక్కలు పరుగెత్తుకుంటూ వచ్చాయి.

ఒక్కొక్కటి మూడు అడుగుల ఎత్తుతో నాలుగడుగుల పొడవుతో, అడుగు పొడవు నాలుకలను బయటకు చాచి అల్సేషన్ కుక్కలను తలదన్నేలాగా బలిష్టంగా, క్రూరంగా వున్నాయి. వాటి ముఖాలను దేంతోనో చదును చేసేసినట్టు బల్లపరుపుగా వున్నాయి. రెండంగుళాల పొడవున్న కోరలు స్పష్టంగా బయటకి కనిపిస్తున్నాయి.

దూరం నించి తోడేళ్ళేమో అనుకున్నారు. మరి కాస్త దగ్గరకొచ్చాక గాని అవి అడవి జాగిలాలన్న విషయం వాళ్ళ మెదడుకు తాకలేదు.

నవీన్ ఒక్క క్షణంకూడా వృధా చెయ్యలేదు. చకచక అమ్ములపొది నుంచి బాణాలు తీసి విల్లు సంధించి చకచక గురిచూసి వదిలాడు.

అంతే! అతని బాణాలు ఒక్కొక్క జాగిలాన్ని నేలమీద దొర్లింపచేశాయి. అంబులపొదిలోంచి తీసే లోపల సౌమ్య తన చేతనున్న అంబులపొదినుంచి బాణాలు సిద్ధంగా అందించింది. దాదాపు పది పన్నెండు జాగిలాలు నేలకరిచాక తక్కినవి తోకలు ముడిచి యెటో పారిపోయాయి.

ఊపిరి పీల్చుకోకుండా బాణాలు సంధించి వదిలిన నవీన్ శారీరకంగా బాగా అలిసిపోయాడు. ఒకదాని వెంట మరొకటి సినిమారీళ్ళలా మహావేగంగా జరిగిపోతున్న సంఘటనలు అతని మానసిక శారీరక క్లేశానికి కారణా

అయ్యాయి.

సౌమ్య జాలిగా చూసిందతనివంక. "కాసేపు అలసట తీర్చుకో నవీ, బాగా టైరయిపోయావు" అన్నది లాలనగా.

"ఉహూఁ. మనకి విశ్రాంతి సరిపడదు. అడవిదాటి అడుగు బయటపెట్టాక ఓ రోజంతా పూర్తిగా విశ్రాంతినే కేటాయిస్తాను. అంతదాకా మన డిక్షనరీలో ఆ మాటకి అర్థమే లేదు" గంభీరంగా ధ్వనించిన అతని మాటలకు, లోలోన గర్వించింది సౌమ్య.

* * *

దూరంగా పొగ పైకిలేస్తూ కనిపించింది.

"బహుశా అక్కడ యీ ఆటవికులు నివసిస్తూండవచ్చు. అటు వెళ్ళటం ప్రమాదకరం!" అన్నాడు నవీన్ చూపుని గుచ్చి చూస్తూ.

సౌమ్య పరీక్షగా చూసి తలూపింది. "అవును, అది మరో గూడెంలాగా వున్నది. ఇది మనకి అలవాటయిన ప్రదేశం కాదు కాబట్టి నిశ్చయంగా అది ఇంకో గూడెం!" అన్నది.

"అయితే యీ చుట్టుపక్కల ఎక్కడో నీరు దొరుకుతుంది. ముఖం కాళ్ళు కడుక్కుంటేగాని అలసట తీరదు. రాత్రినుంచి చాలా దాహంగా వున్నదికూడా!" అన్నాడు నవీన్.

చకచక పక్కనున్న చెట్టెక్కి చుట్టూ పరికించి చూశాడు. వెంటనే కిందికి దిగివచ్చి, "పద, మన కుడివైపు చాలా దగ్గర్లోనే ఏదో సెలయేరు కనిపించింది. పోయి చూద్దాం" అన్నాడు.

ఇద్దరు పదినిమిషాల తర్వాత నీటి చరియ దగ్గరకు చేరుకున్నారు. గతంలో పెద్దపులి నీరు తాగిన సెలయేరు నించి ఒక పాయ విడిపోయి ఆ వైపునించి ప్రవహించినట్టు గ్రహించారు.

నీటిని చూడగానే సౌమ్యకి ప్రాణం లేచివచ్చింది. ఆనందంగా సెలయేట్లో దిగింది. ముఖం, కాళ్ళు చేతులు కడుక్కుని దోసిట్లో నీళ్ళు తీసుకుని తాగింది. తియ్యగా వున్నాయి నీళ్ళు. నిరంతరం అలా ప్రవహిస్తూనే వుండడం వల్లనో యేమో స్ఫటికంకన్న స్వచ్ఛంగా, తెల్లగా వున్నాయి నీళ్ళు. ఇసుక, గులకరాళ్ళు అడుగునుంచి కనిపిస్తున్నాయి.

"స్నానం చేస్తావా?" అన్నాడు చిలిపిగా సౌమ్య వంక చూస్తూ నవీన్.

సౌమ్య చిరుకోపం ప్రదర్శించింది. "ఏమిటి నీ ఉద్దేశ్యం? నీ యెదురుగా స్నానం చెయ్యమంటావా? హౌ డేర్ ఆర్యూ?" అన్నది.

నవీన్ నవ్వేశాడు. వాళ్ళకి ఆ క్షణంలో తామున్న పరిస్థితి గుర్తులేదు, కష్టం సుఖం కలబోసుకుని రెండు రోజులుగా ఎంతో సన్నిహితంగా మెలగటంవల్ల యిద్దరు ఒకర్నొకరు అర్థం చేసుకోవటమేకాక, యిద్దరిమధ్య రహస్యం అన్నదే లేకుండా ఒకటిగా కలిసిపోయారు.

నవీన్ మాత్రం శుభ్రంగా నీటిలో మునిగి అలసట తీరేవరకూ స్నానం చేశాడు. పైకొచ్చాక గుడ్డలు విప్పి పిండుకున్నాడు.

"ఏయ్, నా ముందర అలా నించోకు, నాకు సిగ్గేస్తోంది" అన్నది సౌమ్య సిగ్గుపడుతూనే అతని నగ్న

సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ.

ఆజానుబాహుడైన నవీన్ కసరత్తువల్ల సంక్రమించిన దృఢమైన బాహువులతో విశాలమైన ఛాతీతో సమ్మోహన పరిచేలా వున్నాడు. చామన ఛాయతో దాదాపు ఆరడుగుల ఎత్తు విగ్రహంతో సౌమ్యకి కన్నులపండువ చేస్తున్నాడు.

"నేను పిండనా గుడ్డల్ని?" అన్నది అలవోకగా అతనివంక చూస్తూ.

"ఆ రోజులు ముందున్నాయి. ప్రస్తుతానికి సెల్ఫ్ సర్వీస్!" అంటూ తడిచిన గుడ్డల్ని ఆరకుండానే అలాగే వేసేసుకున్నాడు నవీన్. సౌమ్య అతని భుజాల దగ్గరకు వచ్చింది. ఆమెను పొదివి పట్టుకొని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె గువ్వలా అతని గుండెలమీద తల పెట్టుకొని అరమోడ్పు కన్నులతో అతని కళ్ళలోకి పరవశంగా చూసింది.

"సౌమ్యా, మనదేనాటి బంధమో! అనుకోకుండా కలిశాము. అనుకోకుండా అడవిపాలబడ్డాము. ప్రమాదాల నట్టనడుమ, మృత్యువుకి వెంట్రుకవాసిలో నించున్నాము. అయినా మనకి భయంగాని, బతుకుమీద తీపిగాని లేవు. బతికితే కలిసి జీవితాంతం బతుకుదాం. లేదా కలిసి మృత్యువుని కౌగలించుకుందాం" అన్నాడు నవీన్.

సౌమ్య అతని భుజాలమీదుగా అతని వీపుమీదకి చేతుల్ని ముని వేళ్ళతో బంధించింది.

సరిగ్గా అదే సమయంలో వారిపక్కగా ఏదో అలికిడి అయింది. ఉలిక్కిపడి యిద్దరు విడిపోయారు.

కళ్ళెదుట కనిపించిన దృశ్యం వాళ్ళని నిర్ఘాంతపోయేలా చేసింది.

* * *

బత్తాయికాయ పరిమాణంలో వున్న తేనెటీగలు ఝుమ్మంటూ శబ్దం చేసుకుంటూ వారివైపు రివ్వురివ్వున వస్తున్నాయి.

రాక్షస తేనెటీగల్లా విపరీతమైన పరిమాణంలో వున్న వాటిని చూడగానే యిద్దరికీ ప్రాణాలు అవిసిపోయాయి. అంగుళం పొడవున్న వాటి తొండాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అయితే అదే సమయానికి అటుగా నాలుగు కుందేళ్ళు పరిగెత్తుతూ వచ్చాయి. రాక్షస తేనెటీగలు ఒక్కసారిగా కుందేళ్ళమీదికి దాడిచేశాయి. తెల్లటి కుందేళ్ళు ఒక్కసారిగా నల్లగా మారిపోయినట్టు వాటి దేహాలమీద తేనెటీగలు ఏమాత్రం సందులేకుండా వాలిపోయాయి.

కుందేళ్ళు ముందుకు కదల్లేనట్టు అలాగే ఆగిపోయాయి. సరిగ్గా అయిదు నిమిషాల తర్వాత తేనెటీగలు కుందేళ్ళ మీదినుంచి ఝుమ్మంటూ లేచాయి. కుందేళ్ళ స్థానంలో ఉత్త బొమికలు మాత్రం మిగిలాయి.

నవీన్, సౌమ్య ఆశ్చర్యంగా చూశారా దృశ్యాన్ని రక్తమాంసాలు పీల్చే ఆ రాక్షస తేనెటీగలు తమని చుట్టుముడితే జరగబోయే పర్యవసానం గ్రహింపు రాగానే యిద్దరు ఒకేసారి పరుగు పెట్టసాగారు.

ఏదైనా జంతువో మరేదైనా అయితే విల్లు ఎక్కుపెట్టి బాణం వదిలేవాడు నవీన్. కాని ఆ తేనెటీగల్ని బాణాలతో నాశనం చేయటం సాధ్యంకాని పని

ఏదైనా వెడల్పాటి టెన్నిస్ బ్యాట్‌లాంటిది వుంటే వాటిని వేటాడవచ్చు. కాని ఆ అడవిలో అలాంటి సాధనం ఎలా వస్తుంది?

నవీన్, సౌమ్యలను రాక్షస తేనెటీగలు వెంటాడుతున్నాయి. వందల సంఖ్యలో బారులుతీరి ఎగురుతున్న ఆ తేనెటీగలు పక్షుల గుంపులు ఆకాశంలో యెగురుతున్న దృశ్యాన్ని తలపింపచేస్తున్నాయి. వాటి ఝుమ్మనే నాదం విమానం ప్రొపెల్లరు శబ్దాన్ని మించిపోయింది.

శబ్దం ఆగిపోవటంతో ఇద్దరు చటుక్కున ఆగి వెనక్కి చూశారు. రాక్షస తేనెటీగలు ఏదో జంతువుమీదికి దాడిచేశాయి. పరీక్షగా చూశారు.

అడవిదున్న! పోతరించి భీకరంగా వున్నది! అది తమని వెంటాడి పరుగెత్తుకొస్తున్నట్టుంది. ఈలోపల రాక్షస తేనెటీగలు దాన్ని చుట్టుముట్టేశాయి.

అడవిదున్న శరీరం పూర్తిగా నల్లటి ముసుగు వేసుకున్నట్టు దాని శరీరం నిండా తేనెటీగలు ఆక్రమించుకున్నాయి. అడవిదున్న యిష్టం వచ్చినట్టు అటు యిటు పిచ్చిగా పరుగెడుతోంది. కాని అప్పటికే తేనెటీగలు దాని రక్తమాంసాలు పీల్చేయటం మొదలెట్టాయి.

అడవిదున్న అమాంతం నేలమీద పడిపోయింది.

“ఈ రాక్షస ఈగల రొదలో మనకి అడవిదున్న వెంటాడిన శబ్దంకూడా వినిపించలేదు. నిజంగా ఆ దున్నకి ఈగలు అడ్డుపడకపోతే యీపాటికి ఆ దున్న మనల్ని నేలమీద పొర్లించి చంపేసి వుండేది. ఓ విధంగా ఈ తేనెటీగలు మనకి మహోపకారమే చేశాయి” అన్నాడు నవీన్.

"ఇవి తేనెటీగల్లా కనిపిస్తున్నాయిగాని, నిజానికి తేనెటీగలు కాదు. ఏదో భయంకర జాతికి చెందిన కీటకాలు. తేనెటీగలైతే తేనెపట్టు పెట్టుకుంటాయి. తుట్టను రేపితేగాని అవి రెచ్చిపోయి మనుషుల్ని కుట్టవు. ఇవి రక్తమాంసాల్ని పీల్చే ఏవో కీటకాలు. వీటిని మనం యెప్పుడూ చూడలేదు" అన్నది సౌమ్య.

"అవి అడవి దున్నమీది నుంచి మనమీదికి మళ్ళే లోపల యేదైనా సురక్షిత స్థావరానికి చేరటం అన్ని విధాలా శ్రేయస్కరం."

"అదిగో, ఆ ఎదురుగా రెల్లు గడ్డితో నేసిన గుడిసెలు కనిపిస్తున్నాయి. అనుకోకుండా రాక్షస ఈగలచేత తరమబడి యిక్కడికే వచ్చేశాం."

"అవును. మళ్ళీ కోయల చేతుల్లో చిక్కుకోవటం మంచిది కాదు. మరో దారిన వెళ్ళే ప్రయత్నం చేద్దాం."

"ఆ ఎగుడు దిగుడు కొండదారి తప్పితే మనకి మరో దారి కనిపించటం లేదు. నలిగిన రహాదారిన రావటం వల్లనే యీ గూడెం చేరుకున్నాం."

"సరే, ఆ కొండదారినే ప్రయత్నిద్దాం."

ఇద్దరు మిట్ట పల్లాలతో ఎగుడు దిగుడుగా వున్న దారి పట్టారు. ఎటు చూసినా రకరకాల చెట్లు! పేరు తెలీని చెట్లు అనేకం. ఎక్కువగా మత్తిచెట్లు, మామిడిచెట్లు, జువ్విచెట్లూ కనిపిస్తున్నాయి. తక్కిన చెట్లని యిదివరకు యెన్నడూ వాళ్ళు చూడలేదు!

మామిడిచెట్లనిండా పచ్చగా పండిన పళ్ళు! ఎవరూ కోయకుండా అలాగే వదిలేస్తున్న సూచనగా చెట్లకింద గుట్టలుగుట్టలుగా పడిన పళ్ళు. కుళ్ళిపోయిన పళ్ళు, పిట్టలు

సగం తిని పారేసిన పళ్ళు లెక్కకు మించి వున్నాయి.

చెట్లకి చేతికి అందేటంత కిందుగా వున్న పళ్ళను కోశాడు నవీన్. సౌమ్యకందించాడు. చెట్టునే మాగిన పళ్ళు ఘుమఘుమలాడుతున్నాయి. పళ్ళని చూడగానే అంతర్గతంగా వున్న ఆకలి మేల్కొంది.

ఇద్దరు కడుపునిండా మామిడిపళ్ళు తిన్నారు. సెలయేరు దాటి చాలాదూరం వచ్చేసినందువల్ల దాహంగా వున్నా నీళ్ళు లభించలేదు.

* * *

ఎత్తుగా వున్న కొండను ఏటవాలుగా ఎక్కవలసి రావటంతో సౌమ్య బాగా అలిసిపోయింది.

ఇంకా నాలుగైదు గజాలు యెక్కితే అవతల తట్టున యేముందో చూడటానికి వీలయ్యేది. కాని యింతలోనే వాళ్ళ కళ్ళకు కనిపించిన దృశ్యం కాళ్ళకు బ్రేకులు వేసింది. అకస్మాత్తుగా నిల్చుండిపోయి అటే చూడసాగారు.

అక్కడ బండరాళ్ళను చుట్టుకొని పదుల సంఖ్యలో పాములు వేలాడుతున్నాయి. గోధుమతాచు, నల్లతాచు, రక్తపింజర, కట్లపాములు — రకరకాల పాములు విలవిల్లాడుతూ తిరుగుతున్నాయి. చుట్టూ ఎటు చూసినా కలుగులున్న పుట్టలు!

ప్రత్యేకం అక్కడ పాములకే నిలయమన్నట్టు ఎటు చూసినా అవే! కొన్ని అరడుగుల పొడవు మరి కొన్ని ఎనిమిది అడుగులు అంతకుమించి పొడవు వున్నాయి. చూడటానికి భయంకరంగా, ఊపిరి విడిచిన శబ్దం వింటే యెక్కడ తమని చుట్టుముట్టుతాయోనన్నంత బీభత్సమైన వాతావరణం చూసి కొద్దిక్షణాలు శిలాప్రతిమల్లా నిల్చుండి

పోయారు నవీన్, సౌమ్య.

కొన్ని సర్పాలు చుట్టచుట్టుకొని వుంటే మరికొన్ని తోకమీద నిలిచి నాట్యం చేస్తూన్నట్టు కనిపించాయి. పడగవిప్పిన సర్పాల తలలపై కృష్ణ పాదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్య మధ్య అవి బుస్‌మంటూ తలలు పైకెత్తి మళ్ళీ ముడుచుకొని పడుకుంటున్నాయి.

ఒకేసారి అంత పెద్ద మొత్తంలో వాళ్ళెప్పుడు అన్ని సర్పాలను చూసివుండలేదు. ప్రత్యేకం జూలో పెట్టిన 'సర్పెంట్ సెల్'లాగా వున్నది ఆ ప్రాంతం.

చప్పుడు చెయ్యకుండా కిందికి దిగిపోయారు నవీన్, సౌమ్య. మళ్ళీ సమతలమైన ప్రదేశంలోనికి వచ్చారు.

"దాదాపు రెండు గంటలు వృధాగా నడిచాం. కాళ్ళు నొప్పులు పుట్టేలా మిట్టపల్లాలు ఎక్కి దిగాం. నయం, అవి మనల్ని గుర్తించలేదు. లేకుంటే ఒక్కసారి వాటి మధ్య చిక్కుకుంటే బతికి బయటపడటం కల్ల!" అన్నాడు నవీన్.

సౌమ్య కళ్ళముందు యింకా ఆ సర్పాలు కలకల్లాడుతూ తిరుగుతున్న దృశ్యమే కదలాడుతోంది. ఎంత మరచిపోదామనుకున్నా మరపుకు రావటంలేదు. ఆ సర్పాలు తన కాళ్ళకు చుట్టుకున్నట్టు, కాళ్ళమధ్య సంచరిస్తున్నట్టు తనని చుట్టుముట్టి వున్నట్టు అదోరకమైన మానసిక సంక్షోభంలోపడి చాలా సేపటివరకు తేరుకోలేక పోయింది.

"బాగా భయపడిపోయినట్టున్నావు" అన్నాడు నవీన్ ఆమె వెన్ను నిమురుతూ.

"భయంకాదు. ఏదో చెప్పలేని జలదరింపు. ఒళ్ళు

గుర్నొచ్చి ఇప్పటిదాకా నిమితంగా అనిపించటంలేదు" అన్నదామె పెదాలని నాలుకతో తడుపుకుంటూ.

"కాసేపు విశ్రాంతి...."

"వద్దు వద్దు. అప్పుడే పదిగంటలు కావస్తోంది. సాయంత్రమయ్యేలోపల యిక్కడ్నుంచి బయటికి చేరగలిగితే సంతోషమే!"

ఇద్దరు మళ్ళీ నడక సాగించారు. చెట్లమీద పక్షులు ఏవేవో సంకీర్త ధ్వనులు చేస్తున్నాయి. గుబురుగా వున్న పొదల్లో చిన్నచిన్న జంతువులు అటు యిటు పరుగులు పెడుతున్నాయి. అడవంతా భయంకరమైన నిశ్శబ్దంతో వింతగా అనిపిస్తోంది.

* * *

అకస్మాత్తుగా ఎవరో ఎదురుగా పరుగెత్తుకొస్తున్నట్టు పొడగట్టింది. ఎవరో మనిషి! ఆచ్ఛాదనలేని మనిషి. రెండు కాళ్ళమీదే పరుగెడుతున్నాడు గాబట్టి జంతువుకాదు.

నవీన్ విల్లు సర్దుకున్నాడు. బాణంతీసి చేత సిద్ధంగా పట్టుకున్నాడు. ఆ వ్యక్తి యెదురుతిరిగితే నిర్దాక్షిణ్యంగా బాణంతో కొట్టి చంపేయటానికి నిర్ణయించుకున్నాడు.

అయితే ఆ వ్యక్తి వెనకగా పరుగెత్తుకొస్తూన్న ఎలుగొడ్డును చూడగానే వాళ్ళకు పరిస్థితి అర్థమయిపోయింది. ఆ మనిషిని ఎలుగొడ్డు తరుముకొస్తోంది. ప్రాణభీతితో అతను పారిపోతున్నాడు.

ఆ వ్యక్తి దగ్గరయ్యేసరికి పరీక్షగా చూసి ఆశ్చర్యపోయారు నవీన్, సౌమ్య.

అతను మనిషి కాదు. చింపాంజీ!

మానవ సంతతికి మూలంగా చెప్పబడే మనిషి కాని

మనిషి — చింపాంజీ. ప్రాణభయంతో గునగున పరుగెత్తుకొస్తోంది. ఎలుగుబంటి తరిమి తరిమి కొడుతోంది. దొరికితే చంపెయ్యటానికి సిద్ధంగా నోరు తెరచుకుని కోరలు బయటపెట్టుకొని పరుగెత్తుకొస్తోంది.

నవీన్ ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఎలుగుబంటిని గురిచూసి బాణం వదిలాడు. అది సూటిగాపోయి దాని డొక్కలో దిగబడింది. బాధగా గుర్రుమన్నది ఎలుగు. మరో బాణం వదిలాడు. అది దాని పొట్టను చీల్చేసింది.

ఎలుగ్గొడ్డు నేలమీద పడిపోయి టపటప కొట్టుకున్నది కాసేపు. ఆ తర్వాత దాని శరీరంలో చలనాలు ఆగిపోయాయి.

చింపాంజీ నవీన్ దగ్గరకొచ్చి కృతజ్ఞతను వ్యక్తపరుస్తున్నట్టుగా అతని పాదాలని తాకింది. అతన్ని తాకుతూ చుట్టూ తిరిగింది. చేతులు చాస్తూ గునగున తిరిగింది.

నవీన్, సౌమ్య అచ్చం మనిషిలాగే ప్రవర్తిస్తున్న ఆ చింపాంజీవైపు చిరునవ్వుతో చూశారు.

నవీన్, సౌమ్య ముందుకు అడుగులు వేశారు. చింపాంజీ వాళ్ళ పక్కనే నడవసాగింది. వాళ్ళు ఆశ్చర్యంగా నిల్చిపోతే తనూ నిల్చుండిపోయింది. వాళ్ళు కదిలితే వాళ్ళతోబాటు తనూ ముందుకి కదిలింది. వాళ్ళకి దాని ఆంతర్యం అర్థమయ్యింది. అది తమతోనే రావాలని కోరుకుంటోంది.

నవీన్ సౌమ్య వంక భావయుక్తంగా చూశాడు. "పోనీయ్ నవీ, మనకి సాయంగా వుంటుంది. ఈ

అడవిలో దొరికిన నేస్తం!" అన్నది సౌమ్య దానివంక చిరునవ్వుతో చూస్తూ.

మనిషికి కూడా లేని కృతజ్ఞత చూపుతున్న నోరులేని ఆ జీవివంక ఆప్యాయంగా చూశాడు నవీన్.

ఇద్దరు ముందుకి అడుగులు వేస్తుంటే, వాళ్ళ పక్కన యెంతో తెలిసిన స్నేహితుడిలాగా చింపాంజీ నడవ సాగింది.

* * *

కొంతదూరం ముగ్గురు అలా నడిచాక చింపాంజీ దారి నుంచి చీలిపోయిన ఓ సన్నటి బాటవైపు దారితీసింది.

నవీన్, సౌమ్య ఆగి దానివంక చూశారు. చింపాంజీ చేయెత్తి రమ్మన్నట్టు పిలిచింది. ఆశ్చర్యంగా దాన్ని సమీపించారు. చింపాంజీ ముందుకు దారితీసింది. వాళ్ళు అనుసరించారు. నిర్జనారణ్యంలో దారిచూపుతున్న గైడులా ముందు చింపాంజీ, వెనుక వాళ్ళిద్దరు దాదాపు అరగంట నడిచారు.

నవీన్ కి దూరంగా ఏదో పెంకుటిల్లులాంటి కట్టడం కనిపించింది. సౌమ్యకి చూపించాడు. ఆమెకూడా ఆశ్చర్యంగా ఆ కట్టడంవైపు చూసింది.

"బహుశా ఫారెస్టు రేంజర్ గాని, మరెవరైనా అటవీ అధికారిగాని వుండే నివాసమేమో! చింపాంజీ మన మనసు తెలిసినదానిలాగా మనుషులుండే ప్రాంతానికి తీసుకువెళ్తున్నట్టుంది" అన్నాడు నవీన్. సౌమ్య తలూపింది.

పదినిమిషాల తర్వాత పెంకులతో కట్టిన చిన్న ఇంటిని చేరారు. చుట్టూ గోడబదులు అద్దంతో కట్టబడిన ఆ ఇల్లు

గ్లాస్ హౌస్‌లాగా వుంది. నేలకి అయిదడుగుల ఎత్తులో కట్టబడి వున్నది ఆ యిల్లు. చుట్టూ అడుగు వెడల్పులో గట్టుంది. ఎక్కడానికి మెట్లు లేవు.

ఆశ్చర్యంగా వాళ్ళు ఆ యింటిని సమీపించారు.

ఇంతలో "హేండ్సప్!" అన్న స్వరం చాలా బిగ్గరగా, కర్కశంగా వినిపించింది.

నవీన్, సౌమ్య దిగ్భ్రాంతితో అటు చూశారు. అద్దాల యింటిలోనుంచి తుపాకీ బారెల్ బయటకి పొడుచుకు వచ్చింది.

అప్రయత్నంగానే నవీన్, సౌమ్య చేతులు పైకెత్తి నిల్చున్నారు. చింపాంజీ విస్తుపోయినట్టు చూస్తోంది.

"హూ ఆర్యూ?" అని మళ్ళీ వినిపించింది.

నవీన్, సౌమ్య ఏం చెప్పాలా అని డైలమాలో పడ్డారు.

మళ్ళీ గద్దించి అడిగిందా స్వరం.

"ఉయ్యార్ ఫ్రెండ్స్. నాట్ ఎనిమీస్" అన్నాడు నవీన్ సరళంగా.

అద్దాల తలుపులు తెరుచుకున్నాయి. ఆజానుబాహుడైన వ్యక్తి బయటకొచ్చాడు. అడుగు వెడల్పు వున్న గట్టుమీదనే నించుని తీక్షణంగా నవీన్, సౌమ్యలవంక చూశాడు.

నవీన్, సౌమ్య అతని ముఖంలోకి ధైర్యంగా చూశారు.

అతనికి దాదాపు ఏభై ఏళ్ళుంటాయి. జుట్టు అక్కడక్కడ నెరిసింది. పెద్ద బుగ్గమీసాలున్నాయి. నల్లగా పోతపోసిన కంచువిగ్రహంలా వున్నాడు.

వేటగాళ్ళు వేసుకునే దుస్తులు ధరించాడు. కాళ్ళ మిలటరీ బూట్లున్నాయి. నోట్లో పైపు వెలుగుతోంది. అతను రెండు చేతుల్లోను రైఫిల్ ని ఫర్మ్‌గా పట్టుకొని సరాసరి వాళ్ళిద్దరికి గురిచేసి నించున్నాడు.

"మీ రెవరు? ఎందుకొచ్చారు?" ఆంగ్లంలోనే మళ్ళీ అడిగాడతను.

అతనితో నిజం చెప్పాలా వద్దా అని తటపటాయించాడు నవీన్. అతను చూడగా వేటకోసం వచ్చిన మిలిటరీ మేజరో, వావల్దారో అన్నట్టున్నాడు. కాని బందిపోట్లు ఆ పరిసరాల్లోనే నివసిస్తున్నారు. వాళ్ళ తాలూకు నాయకుడుకూడా కావచ్చును. వాళ్ళు దోచుకున్న సొమ్ము అక్కడ దాచుకుంటున్నారేమో! నాయకుడు దానికి కాపలా వున్నాడేమో! నోరు జారితే ప్రమాదం!

"సర్, మేమిద్దరం సైన్సు విద్యార్థులం. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి రిసెర్చి చేస్తున్నాం. అడవిలో నారికేళ మూలికల గురించి పరిశోధించటానికి మా ప్రొఫెసర్‌తో బాటు పదిహేనుమంది విద్యార్థులం వేన్‌లో వచ్చాం. వాళ్ళు వేర్వేరు స్పాట్స్‌లో కలెక్షన్స్ చేస్తుండగా మేం దూరమయిపోయాం. వేన్ ఎప్పుడు వెళ్ళిపోయిందో, ఎటు వెళ్ళిందో తెలియక వెతుక్కుంటూ యిటువచ్చాం. మీకుగాని మా వేన్ కనిపిస్తే చెప్పి పుణ్యం కట్టుకోండి!" అన్నాడు నవీన్ యే మాత్రం అనుమానం రాని విధంగా.

"ఐ.సీ. యూార్ ఫ్రం విచ్ యూనివర్సిటీ?" అడిగాడతను.

"కాకతీయ యూనివర్శిటీ వరంగల్."

"అంత దూరంనించి మీరీ కీకారణ్యంలోకి యెందు కొచ్చారు? యూ నో, యీ అడవినిండా ఎన్నో క్రూర మృగాలున్నాయి. మానవమాత్రుడెవరూ యీ అడవిలో అరగంటకూడా గడపలేదు. మీ ప్రొఫెసర్ల ధైర్యానికి మెచ్చుకోవాలి!"

"రిసెర్చికోసం కదండీ, అందుకని యెవరూ ఎప్పుడూ చెయ్యని సబ్జెక్టుమీద కొత్తరకం పరిశోధనలు చెయ్యాలని వచ్చాం."

"వెరీ గ్లాడ్ టు మీట్ యూ!.... బైదిబై నా పేరు వీరేంద్ర. మాది బల్లార్షా. నేను మిలిటరీ సర్వీస్ చేసి మేజర్ గా విరమించుకుని వచ్చేశాను. నేను తరచూ యీ అడవికి హంటింగ్ కి వస్తూంటాను. నా కోసం ప్రత్యేకంగా యీ గ్లాస్ హౌస్ నేనే స్వయంగా నిర్మించుకున్నాను. రెండుమూడు రోజులు హంటింగ్ చేసి వెళ్ళిపోతుంటాను" అన్నాడు ఆ వ్యక్తి—వీరేంద్ర.

సంభాషణ ఆంగ్లంలోనే సాగుతోంది. అతను మహా రాష్ట్రుడు. తెలుగు రాదు. వాళ్ళకు మరాఠి తెలియదు. ఉభయులకీ అర్థమయ్యే ఆంగ్లభాష అలా ఉపయోగ పడింది.

"మీరు ఒక్కరే యీ యింట్లో వుంటారా?"

"అవును. ఈ హౌస్ నేను స్వయంగా కట్టుకున్నా నంటే మీరు నమ్ముతారా?"

"మిమ్మల్ని చూస్తే అంత సమురులేననిపిస్తోంది."

"థాంక్యూ!" వీరేంద్ర మొహం నిండా ఉత్సాహం.

"కమాన్, మీరు నా అతిధులు. లోపలికి రండి,

వివరంగా మాట్లాడుకుందాం" అంటూ ఓ చెక్క మెట్లున్న నిచ్చెనను లోపల్నుంచి తెచ్చి గట్టునించి కిందికి తాకేలా అమర్చాడు వీరేంద్ర.

మెట్లమీదుగా ముగ్గురు పైకి ఎక్కారు.

"వాట్, యీ చింపాంజీ మీ కెక్కడ దొరికింది?" అడిగాడు ఆశ్చర్యంగా వీరేంద్ర.

"కొద్ది సేపటి క్రితమే మాకు పరిచయమయింది. ఈ చింపాంజీయే మీ స్థావరానికి మమ్మల్ని వెంటబెట్టుకొచ్చింది."

"మీ చేతిలో యీ విల్లులేమిటి? కొంపతీసి మీరు కూడా హంటర్ కాదుగదా!"

"అబ్బే, అదేం కాదండి! ఏదయినా ప్రమాదం యెదురైతే ఉపయోగించటానికి మా స్టూడెంట్సందరికీ యీ బౌ, ఏరోస్ యిచ్చారు మా ప్రొఫెసర్!"

"ఐ.సీ. మీ ప్రొఫెసర్ బాగా ముందు చూపున్న మనిషిలా వున్నారు. మరి మిమ్మల్ని ఒంటరిగా వదిలి ఎలా వెళ్ళిపోయారో....?! నా అభిప్రాయం ఏమిటంటే మీ ఫ్రెండ్స్ యిక్కడే చుట్టుపట్ల మీకోసం వెతుక్కుంటూ వుంటారు .... మీరిక్కడ రెస్టు తీసుకోండి. నేను జీప్‌లో వెళ్ళి వెతికి వస్తాను."

"జీప్‌లోనా? జీప్ ఎక్కడా కనిపించదేం?"

వీరేంద్ర దూరంగా చెట్ల గుబురులమధ్య ఆకులు అలములతో కప్పి వున్న తన జీప్‌ని చూపించి, "సురక్షితంగా వుండటంకోసం కప్పి పెట్టాను" అన్నాడు.

గ్లాస్ హావుస్ లోపల రెండు ఫోల్డింగ్ ఛైర్స్, ఓ పొడవు బల్ల, దానిమీద కిరోసిన్, స్టౌవ్ వంటసామగ్రి

వున్నాయి. స్టౌమీద యేదో ఉడుకుతోంది.

"ఈ రెండు మూడురోజుల కేంప్ లో నేను నా ఆహారం తయారుచేసుకోవటానికి వంట తెచ్చుకున్నాను. సాధారణంగా చెవులపిల్లులు, పిట్టలు వేటాడి ఆహారం వండుకుంటాను. మీరెప్పుడైనా రుచి చూశారో లేదో కవుజుపిట్ట మాంసం చాలా రుచి. అలాగే చెవులపిల్లి మాంసంకూడా" అన్నాడు వీరేంద్ర.

స్టవ్ మీద ఏదో పదార్థం కుతకుత వుడుకుతోంది. వీరేంద్ర పాత్ర మూత తీసి కారం, ఉప్పువేసి నీళ్ళు పోశాడు.

"మంచినీళ్ళు తాగుతారా?" అన్నాడు కేన్ లో నుంచి ప్లాస్టిక్ గ్లాసుల్లో నుంచి నీళ్ళు వంచి యిస్తూ.

ఒక్కొక్కరు నాలుగు గ్లాసుల నీళ్ళు తాగాక గాని దాహం ఉపశమించలేదు.

వీరేంద్ర వంట చెయ్యటంలో సిద్ధహస్తుడిలాగా వున్నాడు. చాలా రుచికరంగా వండుతున్నాడు.

"మీరు శాఖాహారులా, మాంసాహారులా? అడగటం మరిచిపోయాను" అన్నాడు వీరేంద్ర.

మాంసాహారులమేనని చెప్పాక సంతృప్తిగా తలాడించాడు.

అంతసేపు సౌమ్య వాళ్ళ సంభాషణలో భాగం పంచుకోకుండా కేవలం శ్రోతలాగే వుండిపోయింది.

వీరేంద్ర మసాలాపొడి వేసి కూరని దించి రొట్టెలు చేయటానికి వుపక్రమించాడు.

మొదటిసారిగా సౌమ్య పెదవి విప్పి, "మీరు అలా కూచోండి. రొట్టెలు నే ఒత్తుతాను" అన్నది.

వీరేంద్ర నమ్రతగా నవ్వి "మరేం ఫరవాలేదు. ఈ

పూటకి మీరు నా గెస్టు. అన్నీ స్వయంగా నా చేతుల మీదుగా నే జరగనివ్వండి!" అన్నాడు.

అతని మర్యాదలకు పరవశించిపోయారు నవీన్, సౌమ్య. అతనితో అబద్ధం ఎందుకు చెప్పాలా అని లోలోపల మధనపడుతున్నాడు నవీన్. నిజం చెప్పేస్తే అతడు తమని సురక్షితంగా అడవి బయటకు చేర్చుతాడు. ఏదో ఒక రైల్వేస్టేషన్లోనో బల్లార్షాలోనో వదిలేస్తే, క్షేమంగా ఇళ్ళకు పోవచ్చు. ఇందాకా అబద్ధం చెప్పి ఇప్పుడు నిజం చెప్పినా అతడు నమ్మకపోతే....!? అబద్ధం చెప్పినందుకు ఆగ్రహిస్తే....!?

అసలే మిలిటరీ మనిషి, కోపంలో షూట్ చేసినా ఆశ్చర్యంలేదు. నెమ్మదిమీద అతని మూడ్ కనిపెట్టి మాట్లాడాలి! అతను వేన్ వెతికటానికి వెళ్ళి తిరిగొస్తాడు. వేన్ యెలాగూ లేదు కాబట్టి అతనికి అనుమానం రాకుండా, వేన్ వెళ్ళిపోయింది కాబట్టి తమని అడవి దాటించమని అడగొచ్చు.

ఫరవాలేదు, వీరేంద్ర పెద్దమనిషి. మంచి మర్యాద తెలిసిన వ్యక్తి. తను కష్టాలు గట్టెక్కాయి. తమకి దారి చూపిన చింపాజీ ఋణం ఎలా తీర్చుకోగలరు?

"ఇదుగో, భోంచెయ్యండి!" పేపర్ ప్లేట్సులో రొట్టెలు, పైన మాంసం వేసి వాళ్ళ ముందు పెట్టాడు వీరేంద్ర.

నవీన్ రొట్టె తుంచి నోట పెట్టుకోబోతూ ఆగి చింపాంజీవంక చూశాడు. చింపాంజీ అతని భావం అర్థమయినదానిలాగా బయటకి వెళ్ళి పదినిమిషాల్లో యేవో దుంపలు, కాయలు తెచ్చుకుని వచ్చింది.

మనిషిలాగే తెలివిగా అది ప్రవర్తించిన తీరు వాళ్ళకి

ముచ్చట కలగ చేసింది.

నవీన్ ప్రేమగా చింపాంజీ వీపు నిమిరాడు.

భోజనాలయిన వెంటనే బీరేంద్ర తుపాకీ చేతి పట్టుకుని లేచి, "మీ వేన్ ఎక్కడుందో వెతికి వస్తాను. ఇప్పుడప్పుడే మూడు గంటలు కావస్తోంది. ఈ అడవిలో మరో గంటలో చీకటి పడిపోతుంది. ఓ అరగంటలో నే తిరిగొస్తాను" అన్నాడు.

తన మాటల్ని నమ్మి వేన్ని నిజంగా నే వెతకటానికి వెళ్తున్న బీరేంద్రకి నిజం చెప్పి ఆపు చేద్దామా అన్న ఆలోచనను బలవంతాన అణచుకున్నాడు నవీన్. మిలిటరీ వాళ్ళతో జాగ్రత్తగా వ్యవహరించాలి!

"మీకు చాలా శ్రమ ఇస్తున్నాం!" అన్నాడు నవీన్ బీరేంద్రవంక కృతజ్ఞతగా చూస్తూ.

బీరేంద్ర నవ్వి వెళ్ళిపోయాడు.

ఆ వెనువెంటనే జీపు స్టార్టయిన శబ్దం వినిపించింది.

కడుపునిండా తినగానే కళ్ళకు నిద్ర ముంచుకు వచ్చింది. బీరేంద్ర కేంప్ కాట్ నేలమీదుంది.

"అలా నడుం వాల్చు సౌమ్యా! బాగా అలసిపోయావు" అన్నాడు నవీన్.

"నువ్వు మాత్రం అలసిపోలేదా? నువ్వూ నడుం వాల్చు!" అన్నది సౌమ్య అతని కళ్ళలోకి ప్రేమగా చూస్తూ.

"భగవంతుడి దయవల్ల మనకి మనిషి తోడు దొరికింది. బీరేంద్ర మనల్ని సురక్షితంగా అడవి నుంచి బయటకు చేరుస్తాడు."

"అతను నువ్వు చెప్పిన కథ నమ్మేసినట్టుంది. పాపం, బోళా శంకరుడిలాగా వున్నాడు."

"అందుకే మనకి ఆశ్రయ మిచ్చాడు. కమ్మటి భోజనం పెట్టాడు—ఎలాగైనా మిలిటరీవాళ్ళు దయగా వుంటారు."

"దయగా వుంటే శత్రువుల్ని నుగ్గునూచగా యెలా చంపుతారు? వాళ్ళలో వుండేది దయకాదు! క్రమశిక్షణ, పొలైట్ నెస్. ప్రాణాలకు తెగించిన మొండి ధైర్యం!"

"కరెక్టు. నీతో వాదించి గెలవలేను."

"ఆడపిల్లలకు అంత తొందరగా సరెండర్ అయి పోకూడదు—"

"నీలాంటి ఆత్మీయురాలైన ఆడపిల్లకి సరెండర్ అయి పోవటంలోనే ఆనందముంది."

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

"పాపం, వీరేంద్రకి అబద్ధం చెప్పి మోసం చేశామేమో!"

"అదేం లేదు. నువ్వు వ్యవహరించిన తీరు కరెక్ట్! అతనెవరో, ఎలాంటివాడో తెలియకుండా నిజం చెప్పటం మంచిది కాదు."

"మనని ఓ దారికి చేర్చిన యీ చింపాంజీకి యేమిచ్చి రుణం తీర్చుకోగలం?" ప్రేమగా చింపాంజీ వంక చూశాడు. చింపాంజీ నిశ్చింతగా నిద్రపోతోంది.

"తన ప్రాణం కాపాడినందుకు అదే మన రుణం తీర్చుకుంటోందని అనుకోవాలి!"

ఇద్దరూ నడుం వాల్చారు. నిద్ర కూరుకువస్తోంది.

ఇంతలో జీపు శబ్దం వినిపించింది. ఇద్దరూ లేచి కూచున్నారు.

వీరేంద్ర లోనికొచ్చాడు. "సారీ ఫ్రెండ్స్! మీ వేన్ ఎక్కడా కనిపించలేదు. బహుశా మీ కోసం వెతికి

రాత్రికి మరలిపోయి వుంటారు" అన్నాడు.

నవీన్, సౌమ్య విచారంగా చూశారు సతనిశంక.

"డోంట్ వర్రీ. మిమ్మల్ని బలార్షా చేరుస్తాను. చాలా?" అన్నాడు వీరేంద్ర దయగా నవ్వుతూ.

నవీన్ కృతజ్ఞతగా చూశాడు. "అంతకన్న కావలసిందేముంది సర్!? అక్కడ్నుంచి వరంగల్ ట్రెయిన్‌లో వెళ్ళిపోతాం" అన్నాడు.

"అయితే, మీరు తెల్లవారేవరకు ఆగాలి! ఈ రాత్రికి హంటింగ్‌కి ప్లాన్ చేసుకున్నాను. పులిని వేటాడబోతున్నాను. ఇప్పుడు ఆల్‌మోస్టు చీకటి పడిపోయినట్టే! రాత్రికి యేదో యింత తిని శుభ్రంగా నిద్రపోండి. నేను హంటింగ్‌కి వెళ్ళి యే అర్ధరాత్రికో తిరిగొస్తాను. మీరు కూడా వస్తానంటే సంతోషంగా తీసుకెళ్తాను."

"వద్దు వద్దు! మేము బాగా టైరయిపోయాం. మీరు వేటాడి రండి."

"అలాగే. తెల్లవారగానే బయలుదేరుదాం. మీకు యిక్కడ కష్టంగా లేదు కదా!"

"అబ్బే, అదేం లేదండి ..ఇది అడవి కదా, ఫారెస్టు రేంజి ఆఫీసు, క్వార్టర్సు యేమీ కనిపించకపోవటానికి కారణమేమిటి?" నవీన్ అడిగాడు.

"ఇది అడవిలో బాగా మారుమూల ప్రదేశం! ఇక్కడికి మానవమాత్రుడు—చివరికి ఫారెస్టు డిపార్టుమెంటువాళ్ళు కూడా ప్రవేశించలేరు. ఫారెస్టు రేంజర్ క్వార్టర్సు యిక్కడికి అయిదారు మైళ్ళ దూరంలో. అడవి ఎంట్రెన్స్‌లో వున్నాయి. నేనిక్కడికి హంటింగ్ కొస్తానని వాళ్ళకు తెలుసు. నేనిక్కడ డిపార్టుమెంటు పర్మిషన్ లేకుండా నే యీ గ్లాస్ హౌస్ కట్టుకున్నాను.

జస్ట్ అండర్ స్టాండింగ్, అంతే!"

ఆ తర్వాత సంభాషణ అనేక విషయాల మీదికి మళ్ళింది. అతనికి యే మాత్రం అనుమానం రానివ్వకుండా జాగ్రత్తగా సమాధానాలు చెప్పాడు నవీన్. సౌమ్య కూడా బెరుకు వదలి సంభాషణలో ఉత్సాహంగా పాల్గొన్నది.

రాత్రి భోజనాలయ్యాక వీరేంద్ర నడుము చుట్టూ బుల్లెట్సున్న బెల్టు తగిలించుకుని, గన్ చేతబట్టుకుని హంటింగ్ కి తయారయ్యాడు.

"డియర్ ఫ్రెండ్స్! నేను అర్ధరాత్రి ఎప్పుడో వస్తాను. తలుపు బయట లాక్ చేసుకొని వెళ్తాను. మీకేమైనా అభ్యంతరమా? మంచి నిద్రలో వుంటారేమో, లేపటం యిష్టంలేక యీ యేర్పాటు చేస్తున్నా" అన్నాడు వీరేంద్ర నవ్వుతూ.

"మీరు ఎలా చేసినా అభ్యంతరమేముంది? మా శ్రేయోభిలాషి మీరు!" అన్నాడు నవీన్.

వీరేంద్ర నవ్వుతూ వెళ్ళిపోయాడు. వెంట టార్చి లైటు, సిగార్ లైటర్, పొగడు చెయ్యటానికి చిన్న సీసాలో కిరోసిన్ తీసుకుని వెళ్ళాడు.

వీరేంద్ర వెళ్ళిన పదినిమిషాల తర్వాత నవీన్ సౌమ్యని దగ్గరకు తీసుకుని "మన కష్టాలు గట్టెక్కాయి. ఈ రాత్రి యెలాగో గడిపేస్తే తెల్లారి మనం అడవి దాటి పోవచ్చు" అన్నాడు.

సౌమ్య అతన్ని విడిపించుకుని దూరంగా జరుగుతూ, చంపా జీవంక చూపించింది. చింపాంజీ గదిలో ఓ మూలగా కూచుని వీరివంకే చూస్తోంది.

"ఈ చింపాంజీని మనతో బాటు తీసుకుపోదామా?"

అన్నాడు నవీన్.

"బీరేంద్ర నడిగి అతను చెప్పినట్టు చేద్దాం. ఫారెస్టు ప్రాపర్టీ బయటకు తరలించకూడదేమో కదా!"

"కరెక్ట్, అలాగే చేద్దాం. నాకు నిద్ర వస్తోంది"

కబుర్లలో అలాగే నిద్రకు పడిపోయా రిద్దరూ.

* * *

గ్లాస్ హావుస్ చీకటిగా వుంది.

సౌమ్య కెందుకో అకస్మాత్తుగా మెలకువ వచ్చింది.

తనమీదకు వంగిన ఆకారంవైపు పరీక్షగా చూసి చిన్నగా కేక పెట్టింది.

మొదట నవీన్ అనుకుని మృదువుగా మందలించ బోయింది. కాని అతను నవీన్ కాదు.

మేజర్ బీరేంద్ర!

నిర్ఘాంతపోయింది సౌమ్య. నిజాన్ని జీర్ణం చేసుకోవటానికి ఆమెకు కొద్దిక్షణాలు పట్టింది. అతనిదగ్గర ఖరీదైన బ్రాందీ వాసన వేస్తోంది.

సౌమ్య ఉక్కిరి బిక్కిరై పోయింది.

కవ్వున అరిచింది సౌమ్య.

బీరేంద్ర, ముందు కొంచెం జంకినా మళ్ళీ వెంటనే ఆమెమీదికి లంఘించి ఆమెను ఆక్రమించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

సౌమ్య బ్లౌజు హుక్స్ ఎప్పుడో వూడిపోయాయి. బ్రా హుక్ కూడా వూడిపోయి వుంది. ఆమె చీర స్థానభ్రంశం చెందివున్నది. బాగా అలసిపోయి గాఢంగా నిద్రపోవటంవల్ల ఆమెకు వెంటనే మెలకువ రాలేదు. ఈ లోపల అవకాశాన్ని వినియోగించుకున్నాడు బీరేంద్ర.

తన కంఠంలో ప్రాణముండగా అతనికి లొంగ

కూడదు. అదీ ఆమె దృఢనిశ్చయం!

ఆమె అతనితో పెనుగులాడుతూనే కేకలు పెడుతోంది. ఓ పక్క ఆమె నోరు నొక్కి పడుతూ మరోపక్క ఆమెను తన స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి తీవ్రంగా ప్రయత్నిస్తూన్నాడు వీరేంద్ర. అతని పశుబలం ముందు ఆమె ప్రతిఘటన నీరుగారిపోతోంది.

ఇంతకీ, యింత జరుగుతున్నా నవీన్ ఏమైనట్టు? కొంప తీసి వీరేంద్ర అతన్ని ....!?

ఆ ఆలోచన రాగానే చిగురాకులా వణికిపోయింది. నిస్సహాయంగా కేక పెట్టింది. గ్లాస్‌హావుస్‌లో ఆమె గొంతు ప్రతిధ్వనించింది.

చటుక్కున మెలకువ వచ్చింది నవీన్‌కి. కొద్దిక్షణాల వరకు తనెక్కడున్నాడో, యేం జరుగుతున్నదో అతనికి వెంటనే అవగాహన కాలేదు. అంతా చీకటిగా అగమ్య గోచరంగా వున్నది. ఈలోపల మరోసారి సౌమ్య కేక ప్రతిధ్వనించింది.

ఒక్క ఉదుటున లేవబోయాడు. కాని అతని కాళ్ళు చేతులు వెనక్కి కట్టబడి వున్నాయని, తన నెవరో బంధించారని గ్రహించేసరికి, జరిగిందేమిటో, ఒక్కొక్కటి గ్రహింపుకొచ్చాయి.

తనని బంధించి సౌమ్యమీద అఘాయిత్యం చేస్తున్నారెవరో!....ఎవరు? వీరేంద్ర యేమయ్యాడు? కళ్ళు చికిలించి చూశాడు. అతని కళ్ళు చీకటికి అలవాటుపడ్డాయి. వీరేంద్ర అత్యాచారాన్ని, ప్రతిఘటిస్తున్న సౌమ్యని స్పష్టంగా చూశాడు.

కాని....తను నిస్సహాయుడు! తనని ముందు జాగ్రత్త కోసం బంధించి మరీ తన పాశవిక కోరికను తీర్చుకో

బోతున్నాడు వీరేంద్ర. ఎంతో మంచివాడిలా, శ్రేయోభిలాషిలా నటించి, ఆశ్రయమిచ్చి తన సౌమ్యమీద అత్యాచారానికి తలపడ్డాడు. ఎంతటి నయవంచకుడు!

ఈ లోపల వీరేంద్ర సౌమ్యని తన వశంలోకి తెచ్చుకోవటంలో విజయం సాధించాడు. మరికొద్ది క్షణాల్లో ఆమె కన్యత్వం మంటకలిసి పోయివుండేదే! కాని, సరిగ్గా అప్పుడే ఓ అద్భుతం జరిగిపోయింది.

ఓ మూలగా నిద్రిస్తూన్న చింపాంజీ ఒక్కసారిగా వీరేంద్రమీద దాడి చేసింది. నవీన్ విషయంలో జాగ్రత్త తీసుకున్న వీరేంద్ర చింపాంజీ విషయంలో అశ్రద్ధ చేశాడు. అదే అతను చేసిన పెద్ద పొరపాటు.

వీరేంద్ర చింపాంజీ ధాటినుంచి తనను తను రక్షించుకునే ప్రయత్నంలో సౌమ్యని వదిలి, చింపాంజీమీద తిరగబడ్డాడు. దూరంగా వున్న తుపాకీవైపు దొర్లబోయాడు. కాని చింపాంజీ అతనికా అవకాశం యివ్వలేదు. అతన్ని అంగుళం కూడా అటు కదలనివ్వలేదు.

ఈ అవకాశాన్ని సౌమ్య బాగా వుపయోగించుకున్నది. ఒక్క అంగలో వెళ్ళి నవీన్ కట్లు విప్పేసింది.

అయితే యింతలోనే చింపాంజీ గుండెలమీద చాచి తన్ని ఒక్క వుదుటన్న గన్ వున్న చోటికి గెంతి గన్ అందుకున్నాడు వీరేంద్ర. ముందుగా చింపాంజీ మీదికి కాల్చబోయాడు.

మెరుపులా అతన్ని వెనుకనుంచి వాటేసుకున్నాడు నవీన్. గుండు గురితప్పి అద్దాన్ని బద్దలు చేసుకుంటూ బయటకు దూసుకుపోయింది. ఈసారి సౌమ్యను కాల్చాలనుకున్నాడు వీరేంద్ర.

అయితే చింపాంజీ యెగిరి అతని చేతిలోని గన్ను

యెగరగొట్టేసింది. మరుక్షణం గన్ నవీన్ చేతుల్లోకి వచ్చేసింది.

నవీన్ ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా వీరేంద్రని కాల్చేశాడు. వీరేంద్ర అమాంతం విరుచుకుపడిపోయాడు. అతి దగ్గర్నుంచి అతని ఛాతీకి గురిచేయబడ్డ గుండు అతని గుండెల్లో చిక్కుకుంది. అయినా ప్రాణంపోలేదు. కూరలు తరుక్కునే కత్తిని దొరకపుచ్చుకొని నవీన్ మీదికి విసరబోయాడు. మరోసారి అతని ప్రయత్నాన్ని వమ్ముచేసింది చింపాంజీ.

ఈలోపల గన్ లోడ్ చేసుకుని వరసగా రెండుసార్లు కాల్చాడు నవీన్.

వీరేంద్ర శ్వాస శాశ్వతంగా ఆగిపోయింది.

సౌమ్య సుడిగాలిలా వచ్చి నవీన్‌ని అల్లుకుపోయింది. ఆమె బాగా భయపడిపోయింది. క్రూరమృగాలకు కూడా చలించని ఆమె యీ సంఘటనతో బెదిరిపోయింది.

చిగురుటాకులా వణుకుతున్న సౌమ్య వెన్ను ఆప్యాయంగా నిమిరాడు నవీన్. చల్లగాలి సోకిన మేఘంలా భోరున యేడ్చేసింది సౌమ్య.

“వాడు చచ్చాడు, నీకేం భయంలేదు. ఊరుకో!” అన్నాడు నవీన్ ఓదార్పుగా.

కొంతసేపటికి సౌమ్య మామూలు మనిషయింది. “వీడింత మేకవన్నె పులి అనుకోలేదు. ఎంతో మర్యాదస్తుడిలాగా పెద్దమనిషిలాగా నటించాడు. మోసపోయాం” అన్నది.

చింపాంజీని ఆప్యాయంగా నిమిరింది సౌమ్య. తను మలిన పడకుండా కాపాడింది చింపాంజీ. ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు? నవీన్ దాని ప్రాణం కాపాడి

వందుకు అది తన మానప్రాణాలను కాపాడింది. ఎంత కృతజ్ఞత!

నవీన్ అప్పటికప్పుడే ఓ నిర్ణయానికి వచ్చాడు. వీరేంద్ర గన్ మళ్ళీ లోడ్ చేశాడు. వీరేంద్ర ఓ పక్కగా దాచిపెట్టిన బుల్లెట్స్ బెల్టుని నడుం చుట్టూ కట్టుకున్నాడు.

"మనం వెంటనే వీడి జీపులో అడవి దాటిపోదాం. నాకు డ్రయివింగ్ వచ్చు" అన్నాడు నవీన్. వీరేంద్ర దుస్తులు తడిమి జీపు తాళాలు తీసుకున్నాడు.

ఇద్దరూ గ్లాస్ హావుస్ నుంచి బయటికొచ్చారు. వాళ్ళని అనుసరించింది.

అప్పుడు రాత్రి రెండుగంటలు కావస్తోంది.

● ● ●

జీపుని కప్పిపెట్టిన ఆకులలములు తొలిగించారు ఇద్దరు కలిసి.

అది ఓ ఓపెన్ టాప్ జీపు. కేవలం యిలాంటి చోట హంటింగ్ కోసం ఉద్దేశింపబడిన జీపు. అవసరమైతే టాప్ వేసుకోవటానికి వీలుగా సపోర్టింగ్ రాడ్స్ పైనుంచి అర్థచంద్రాకారంగా వున్నాయి.

ఇగ్నిషన్ కీ తిప్పగానే జీపు స్టార్టయింది. నవీన్ పక్కసీట్లో సౌమ్య కూచుంది. వెనక సీట్ లేకుండా ఖాళీగా వున్న జాగాలో చింపాంజీ కూచున్నది.

హెడ్‌లైట్సు వెలుగులో దారి చూసుకుంటూ మెల్లగా జీపుని ముందుకి పోనిచ్చాడు నవీన్.

దారి అంతా ఎగుడుదిగుడుగా వుంది. వీరేంద్ర యెలాగూ అడవి దాటిస్తాడనే గుడ్డినమ్మకంతో వున్న తను అడవి బయటికి దారి యెటుందో అడగలేదు. కాని అక్క

డికి అయిదారు మైళ్ళ దూరంలో ఫారెస్టు రేంజర్ క్వార్టర్సున్నట్టు మాటల సందర్భంలో వీరేంద్ర చెప్పాడు. కాని అది యే డైరెక్షన్‌లో వుందో చెప్ప లేదు, తను అడగలేదు.

పోను పోను దారి యిరుకై పోయింది. జీపు సునాయాసంగా వెళ్ళగల దారి కాదు. వీరేంద్ర ఉపయోగించే దారి అది కాదు. ఎలా యిప్పుడు?

మరికొంత దూరం వెళ్ళేసరికి దారి పూర్తిగా కప్పబడి పోయింది. అన్నీ ముళ్ళకంపలు, పిచ్చి మొక్కలు, రాళ్ళు రప్పలుతో నిండిపోయి జీపు మరో గజం కూడా ముందుకు వెళ్ళలేని పరిస్థితి ఎదురయింది.

“బాడ్‌లక్! చేతిలో జీపు వుండికూడా తప్పించుకు పోలేకపోతున్నాం. బాక్ చేస్తున్నా” అంటూ జీపుని వెనక్కి త్రిప్పి వచ్చిన దారినే పోనిచ్చాడు నవీన్.

దారి పొడవునా యేవో జంతువులు అటు ఇటు పరుగెత్తడం హెడ్‌లైట్సు వెలుగులో కనిపిస్తోన్నది. పాములయితే చెప్పటానికి వీల్లేనన్ని కనిపిస్తున్నాయి. రకరకాల సర్పాలు అటు యిటు పరుగెత్తుతున్నాయి మహావేగంతో. కొన్ని జీపు కిందపడి నలిగిపోతున్నాయికూడా.

గ్లాసు హౌవుస్ యింకో ఫర్లాంగు మార్గముండగా దారి ఓ చోట చీలిపోయి కనిపించింది. జీపు ఆపాడు నవీన్. ఇందాకా తొందర్లో గమనించలేదు గాని, ఈ రెండో దారి కాస్త వెడల్పుగానే కనిపిస్తోంది.

జీపు అటు తిప్పాడు నవీన్. కొంత దూరంవరకూ ప్రయాణం సజావుగానే జరిగింది. కాని, అంతలోనే అనుకోని అవాంతరం వచ్చిపడింది.

ఒక్కసారిగా పది పదిహేను కొండముచ్చులు జీప్

మీద దాడిచేశాయి. అంతదాకా చెట్లమీద వున్నట్టు వున్నాయి. టాప్ లేని జీప్ మీదకి టపటప ఉరకేశాయి.

సౌమ్య బెదిరిపోయింది వాటిని చూసి. నల్లటి ముఖాలతో, ఒళ్ళంతా బూడిద రంగు బొచ్చుతో, పళ్ళు యికిలిస్తూన్నట్టు కిచకిచమంటూ మీదకొచ్చేస్తున్నాయి. నోరు తెరిచి అలా మీదకొస్తున్న వాటి కోరలు చీకట్లో కూడా మెరుస్తున్నాయి.

నవీన్‌కి వాటి ఆంతర్యం అర్థమయ్యింది. ఈ అడవిలో సాధు జంతువు మచ్చుకైనా లేదు. అన్నీ మాంసాహారుల లాగే వున్నాయి.

"సౌమ్యా, కిందికి ఉరికెయ్యి, జీప్ స్లో చేస్తున్నాను...." అంటూ జీప్ వేగం తగ్గించి సౌమ్య కిందికి దిగిపోగానే బ్రేక్ వేసి ఆపేసి, కిందికి ఉరికాడు.

అప్పటికే అవి స్టీరింగ్ మీదకి దాడిచేశాయి. నవీన్ గన్‌తో రెండుసార్లు కాల్చగానే ఒక్కసారిగా అవి బెదిరిపోయి చెల్లాచెదురై పోయాయి. గుళ్ళు వ్యర్థం కాలేదు. నాలుగైదు కొండముచ్చుల్ని గాయపరిచాయి. ఈలోపల మరోసారి గన్ లోడ్ చేసుకుని కాల్చాడు.

కొండముచ్చుల్లో మరో రెండు నేలకూలిపోయాయి. ఎక్కడివక్కడ క్షణాల్లో మాయమయిపోయాయి.

చెట్టు పక్క నుంచి సౌమ్య బయటికొచ్చింది. ఆమె కూచున్నాక తిరిగి జీప్ స్టార్టు చేశాడు నవీన్.

సౌమ్య ముఖం గంభీరంగా వున్నది. ఆమెకి ప్రమాదాలను ఎదుర్కొని ఎదుర్కొని వాటిపట్ల భయం, చెదిరి పోయాయి. ఇక ఎంతటి విపత్కర పరిస్థితుల్లోను కూడా భయపడకూడదని, ఆత్మవిశ్వాసం సడలించుకో కూడదని గట్టిగా నిర్ణయించుకున్నది. (సశేషం)